క్లుప్తంగా

రైతు గుర్తింపు రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి



చాట్రాయి: రైతు విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ షేక్ హబీబ్ బాషా అన్నారు. మండలంలోని నరసింహారావుపాలెం, చనుబండ గ్రామాల్లో రైతు విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ సంఖ్య వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని, రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. ఏడీఏ విద్యాసాగర్, వ్యవసాయాధికారి బి.శివశంకర్ పాల్గొన్నారు.

పేట రామారావుకు నివాళి

తిరువూరు: కమ్యూనిస్టు యోధుడు, తిరువూరు నియోజకవర్గ ప్రథమ ఎమ్మెల్యే పేట రామారావు వర్ధంతి కార్యక్రమం స్థానిక సుంకర వీరభద్రరావు భవన్‌లో శనివారం జరిగింది. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నాయకులు పసుపులేటి వెంకయ్య, ఎస్కే నాగుల్‌మీరా, పరుచూరి రాజేంద్ర, చిలుకూరి వెంకటేశ్వరరావు, మాలపాటి ఉదయ్, సుబానీ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పల్లెపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఐఓటీ అనుసంధానంతో సమస్యలకు పరిష్కారం



మైలవరం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచంలో ప్రాజెక్టులు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ)తో అనుసంధానం చేయడం ద్వారా ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎస్‌హెచ్ అండ్ ఐఎస్ కంపెనీ డైరెక్టర్ ఎస్.ప్రదీప్‌కుమార్ అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ కార్యక్రమం శనివారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక ప్రాజెక్టు చేశారని, అతి తక్కువ సమయంలో విద్యార్థులు ఐదుకు పైగా ఐఓటీ టూల్స్ నేర్చుకున్నారని చెప్పారు. హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్ రమాదేవి మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇంకా ఎన్నో విలువైన ప్రాజెక్టులు చేయడానికి ఇది దారి చూపిస్తుందన్నారు. అసిస్టెంట్ ప్రొ ఫెసర్లు పి. మాధవి, లక్ష్మీ పద్మావతి పాల్గొన్నారు. రిసోర్స్‌పర్సన్ ఎస్.ప్రదీప్‌కుమార్, ప్రొఫెసర్ రమాదేవి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

పెనుగొలనులో స్వచ్ఛ దివస్

తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలను శాఖా గ్రంథాలయంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. లైబ్రేరియన్ జె. శ్రీలత ఆధ్వర్యంలో విద్యార్థులు, పాఠకులు గ్రంథాలయంలో చెత్తాచెదారం తొలగించి, ఆవరణను శుభ్రం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు పాల్గొన్నారు.

పిల్లల సమగ్రాభివృద్ధికి శిక్షణ

తిరువూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరు సంవత్సరాల లోపు పిల్లల సమగ్రాభివృద్ధికి నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతులను అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు ఐసీడీఎస్ సీడీపీఓ సత్యవతి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన మిషన్ పోషణ్, జాతీయ విద్యా విధానం కింద గుర్తించిన పిల్లల్లో కీలకాభివృద్ధికి, నైపుణ్యాలను పెంపొందించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రిటైర్డ్ ఏసీడీపీఓ ఝాన్సీ, సూపర్‌వైజర్లు రాజేశ్వరి, భవాని పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

నూజివీడు: మొర్సపూడిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై రూరల్ ఎస్ఐ ఎస్.లక్ష్మణ్‌బాబు తన సిబ్బందితో కలిసి శనివారం దాడి చేశారు. ఈ దాడిలో 9 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.23,840 స్వాధీనం చేసుకున్నారు. తొమ్మిది మంది జూదరులపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎవరైనా కోడిపందేలు, పేకాట వంటి జూదాలు నిర్వహిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా జూదం నిర్వహిస్తే సెల్: 94407 96449కు కానీ 112కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

సారా విక్రయదారుల బైండోవర్

ముసునూరు: సారా విక్రయించిన పాత నేరస్తులు నలుగురిని శనివారం తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశామని నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. చెక్కపల్లికి చెందిన తాళం సంపతరావు, ముసునూరుకు చెందిన పేరిచర్ల సాయికుమారి, కంచర్ల పార్వతి, వీరంకి సారికను బైండోవర్ చేశారు. నేరాలకు పాల్పడితే ప్రభుత్వం నుంచి అందే సౌకర్యాలు, పథకాలు రద్దవుతాయని, రూ.లక్ష జరిమానా విధిస్తామని తహసీల్దార్ హెచ్చరించినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. అక్రమంగా మద్యం, సారా విక్రయాలు కొనసాగిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రమాదాలకు నెలవుగా రహదారులు

- ద్విచక్ర వాహన ప్రమాదాలే అధికం
- ఏడాదిలో 100 ప్రమాదాలు
- 50 మరణాలు, 100 మంది క్షతగాత్రులు



తిరువూరు బైపాస్ రోడ్డులో ప్రమాదాలు జరిగే ప్రదేశాలు సర్వే చేస్తున్న పోలీస్, జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అధికారులు

తిరువూరు: తిరువూరు సర్కిల్‌లో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. వాహన చోదకుల నిర్లక్ష్యానికి తోడు మితిమీరిన వేగం, ఇతర కారణాలతో ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు. ఇబ్రహీంపట్నం–జగదల్‌పూర్ జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే మలుపులు గుర్తించినప్పటికీ ముందస్తు జాగ్రత్త చర్యలను చేపట్టకపోవడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. 2024లో ఎ.కొండూరు మండలంలోనే ఎక్కువ ప్రమాదాలు జరిగాయి. 2023లో కంటే గత ఏడాది రోడ్డు ప్రమాదాలు 30 శాతం పెరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. లారీలు, భారీ వాహనాలను ఓవర్‌టేక్ చేసే క్రమంలోనే ప్రమాదాలు జరిగి ద్విచక్ర వాహన చోదకులు మృత్యువాత పడుతున్నారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

మద్యం సేవించి...

వాహన చోదకులు మద్యం సేవించడంతో వేగంపై నియంత్రణ కోల్పోతున్నారని పోలీసులు భావిస్తున్నారు. రాత్రి వేళల్లో భారీ వాహనాలు, కార్లు మలుపుల్లో అదుపు తప్పి గోతుల్లో పడిపోతుండటంతో ప్రమాదాల చోటుచేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహన చోదకులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది.

ప్రమాదాలు జరిగే ప్రాంతాలు ఇవి..

తిరువూరు మండలంలోని లక్ష్మీపురం, కాకర్ల, మల్లేల, ఎ.కొండూరు మండలం జీళ్లకుంట, పోలిశెట్టిపాడు, ఎ.కొండూరు గ్రామాల వద్ద ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. తిరువూరు పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డు చర్చి సెంటర్, తోకపల్లి, క్లబ్ సెంటర్లు, పశువుల సంత ఎదురుగా కూడా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ, పోలీస్ అధికారులు సర్వేలో గుర్తించినప్పటికీ ఇంతవరకు నియంత్రణ చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

2024 జనవరి నుంచి 2024 డిసెంబర్ వరకు జరిగిన ప్రమాదాలు

పోలీస్‌స్టేషన్	జరిగిన ప్రమాదాలు	మరణాలు	క్షతగాత్రులు
ఎ.కొండూరు	39	19	37
తిరువూరు	35	17	53
విస్సన్నపేట	16	7	13
గంపలగూడెం	12	6	4
మొత్తం	94	49	97

వాహన చోదకులు జాగ్రత్తలు పాటించాలి



వాహనాలు నడిపేవారు రోడ్డు భద్రతా నియమావళి పాటించాలి. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడపడం నేరం. విధిగా హెల్మెట్ ధరించాలి. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదు. జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం.

– గిరిబాబు, తిరువూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్

నిబంధనలు తప్పనిసరి



వాహన చోదకులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవు. యువకులు, డ్రైవింగ్ లైసెన్సులు లేకుండానే అతి వేగంతో ద్విచక్ర వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. తిరువూరు ప్రధాన రహదారిలో రద్దీ వేళల్లో కూడా ఆకతాయిలు నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నందున పోలీసులు చర్య తీసుకోవాలి.

– దుబ్బాకు ఆనందరావు, తిరువూరు

ప్రజల్ని చైతన్యవంతులను చేయాలి



రోడ్డు భద్రతా నియమావళిపై పోలీసు శాఖ ప్రజలను చైతన్యవంతం చేయాలి. ట్రాఫిక్ నియంత్రణతో పాటు జాతీయ రహదారిపై వాహనాల వేగ నియంత్రణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలి. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా తిరువూరు, విస్సన్నపేట పట్టణాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి.

– బి. వెంకటేశ్వరరావు, తిరువూరు

ప్రజా భాగస్వామ్యంతో ఆరోగ్యకర సమాజ నిర్మాణం

జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



గుంటుపల్లిలో ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. గుంటుపల్లిలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ చేపట్టిన ఇంకుడు గుంతలను కలెక్టర్ పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం ద్వారా ఉత్పత్తి చేసిన వర్మి కంపోస్ట్ ఎరువు విక్రయ కేంద్రాన్ని సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత నెలలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలు విజయవంతమయ్యాయని చెప్పారు. ప్రతి గ్రామంలో స్వచ్ఛతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇళ్ల వద్దే తడి, పొడి చెత్త వేరుచేయడం అవలంబించాలని సూచించారు. వర్మి కంపోస్ట్ ద్వారా లభించే ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి ఉపయోగించుకోవచ్చన్నారు. భూగర్భ జలాల వృద్ధితో పాటు స్వచ్ఛతకూ దోహదం చేసే ఇంకుడు గుంతలను ప్రతి ఒక్కరూ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.6 వేలతో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టవచ్చన్నారు. జిల్లాలో ఈ ఒక్క రోజు 1,365 గుంతల నిర్మాణం చేపట్టారని తెలిపారు. గ్రామ, మండలాలు పరిశుభ్రంగా ఉంటే మన జిల్లా, ఆపై రాష్ట్రమే స్వచ్ఛతలో దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని కలెక్టర్ వివరించారు. అనంతరం స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ సునీతశర్మ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తూరు తండాలో న్యాయ విజ్ఞాన సదస్సు

నూజివీడు: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని వాటికి అనుగుణంగా జీవనం సాగించాలని సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసిం అన్నారు. కొత్తూరు తండాలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. దీనిలో భాగంగా జడ్జి షెడ్యూల్ కులాల వారికి ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. జడ్జి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. చదువే జీవితాల్లో మార్పును తీసుకువస్తుందని వివరించారు. క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోకుండా శాంతియుతంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది గోపీనాథ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుదాం

చాట్రాయి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి వెంకటరత్నం పిలుపునిచ్చారు. శనివారం చాట్రాయిలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రత వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పా రు. పరిశుభ్రత అందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, నాగేశ్వరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



విస్సన్నపేటలో మొక్కలు నాటుతున్న డీఎంహెచ్ఓ సుహాసిని



ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న సీఈ నాగరాజు, ఉద్యోగులు

ప్రిన్సిపాల్ నవీన లావణ్యలత

నూజివీడు: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా జీవించవచ్చని ప్రిన్సిపాల్ జె. నవీన లావణ్యలత అన్నారు. స్థానిక ఎమ్మార్ అప్పారావు కాలేజీ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సెస్ ఆవరణలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ప్రారంభించి పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

- నూజివీడు పీఏసీఎస్ ఆవరణలో పెరిగిన గడ్డిని, పిచ్చి మొక్కలను సిబ్బంది శనివారం తొలగించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ నీలం నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.
- కోపరేటివ్ డీఆర్ కార్యాలయం వద్ద శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కో–ఆపరేటివ్ డీఆర్ మరీదు రవికుమార్ ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేసిన అనంతరం స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛ దివస్

తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. కాకర్ల, లక్ష్మీపురం గ్రామ పంచాయతీలలోని వీధుల్లో చెత్తాచెదారాన్ని తొలగించి మొక్కలు నాటారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. స్వచ్ఛతా దివస్ ప్రతిజ్ఞ చేశారు. పంచాయతీ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి..

విస్సన్నపేట: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి సుహాసిని అన్నారు. విస్సన్నపేట బస్టాండు సెంటర్‌లో శనివారం స్వచ్ఛ దివస్, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక అధికారులతో కలిసి సుహాసిని చెత్తాచెదారం తొలగించారు. మురుగునీరు రోడ్లపై వదలవద్దని, తాగునీరు కాచి వడబోసి తాగాలని ఆమె సూచించారు. విస్సన్నపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఉద్యోగులు, విద్యార్థులు స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేశారు. మండల ప్రత్యేకాధికారి చక్రాణి, తహసీల్దార్ లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ చిన రాట్నాలు, వైద్యాధికారి శ్రీనివాసరావు, పంచాయతీ ఈఓ హరికృష్ణ కుమార్ పాల్గొన్నారు.

ముసునూరు: గ్రామాల్లో కాలుష్య కారకాలను తొలగించి, పచ్చదనం పెంచడంతోపాటు పరిశుభ్రమైన పరిసరాల ఏర్పాటు లక్ష్యంతో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్రా-స్వచ్ఛ దివస్ సందర్భంగా ఈఓపీఆర్డీ బసవరాజు అచ్యుత సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాల వద్ద సర్పంచ్‌ల అధ్యక్షతన శనివారం కార్యాలయ పరిసరాలను పరిశుభ్రం చేశారు. ముసునూరు పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించి, స్వచ్ఛ ఆంధ్ర ఆవశ్యకతను వివరించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

- ఇబ్రహీంపట్నం: స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం జరిగాయి. ఎన్టీటీపీఎస్‌లో జరిగిన కార్యక్రమాన్ని సంస్థ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు ప్రారంభించారు. సంస్థలోని ఎకౌంట్స్ కార్యాలయం పరిసరాలను శుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీఈ తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. పలువురు సీనియర్, జూనియర్ ఇంజినీర్లు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు. జూపూడి పంచాయతీ పరిధిలో జరిగిన కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వైఎస్ భాగ్యలక్ష్మీ ఇంటింటికి తడి, పొడి చెత్త వేరుచేసే పద్ధతిపై అవగాహన కల్పించారు. ప్రజల భాగస్వామ్యంతో జరిగిన కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

క్లస్టర్స్ స్కూల్ సమావేశాలు

ముసునూరు: విద్యార్థులకు బోధనలో మెరుగైన విధానాలు పాటించాలని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు అన్నారు. ముసునూరు, చెక్కపల్లి, గోపవరం హైస్కూల్లో హెచ్ఎంలు సునీల, అబ్బాస్, శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం క్లస్టర్ స్కూల్స్ సమావేశాలు నిర్వహించారు. మూడు క్లస్టర్స్ స్కూల్స్ పరిధిలోని 214 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎంఈఓ మాట్లాడుతూ పాఠ్య ప్రణాళిక, బోధనా సామగ్రిని ఉపయోగిస్తూ బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కళాశాల ప్రాంగణం శుభ్రం

మైలవరం: గ్రామాలు, ఇళ్లు, కళాశాలల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైస్ ప్రిన్సిపాల్ పి. రంగారావు అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. విద్యార్థులు కళాశాల తరగతి గదులు, కళాశాల ప్రాంగణంలో చెత్తచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ రంగారావు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ ఉద్దేశం, ప్రాముఖ్యత, పరిసరాల పరిశుభ్రత అవసరం, ఆరోగ్యకరమైన వాతావరణం కోసం తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వి.ఫణికుమార్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

తిరువూరు: మధుమేహ రోగుల వైద్యశిబిరం ఆదివారం స్థానిక ఫ్యాక్టరీ సెంటర్‌లో నిర్వహిస్తామని జన విజ్ఞాన వేదిక పట్టణ అధ్యక్షుడు పాపారావు తెలిపారు. నాగార్జున స్కూల్ ఆవరణలో జరిగే వైద్యశిబిరంలో మధుమేహం, రక్తపోటు, మూర్ఛ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేస్తారన్నారు. తెల్లవారుఝామున ఐదు నుంచి ఉదయం 11 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందని చెప్పారు.

ఆక్రమిత భూమిలో ఇనుప కంచె తొలగింపు



ఇనుప కంచె, రాళ్లను పొక్లెయిన్‌తో తొలగింపజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

మైలవరం: రెడ్డిగూడెం మండలం నాగులూరు గ్రామంలో ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమి చుట్టూ వేసిన ఇనుప కంచెను రెవెన్యూ అధికారులు పొక్లెయిన్‌తో శనివారం తొలగించారు. దీనిపై రెడ్డిగూడెం ఆర్ఐ గంధం పుల్లయ్య మాట్లాడుతూ రెడ్డిగూడెం మండలం నాగులూరు గ్రామంలోని రీ సర్వే నంబర్లు 372/3లోని ఎ.0.65 సెంట్లు, రీ సర్వే నంబర్ 373లో ఎ.0.65సెంట్లు ఎఫ్ఎల్ఆర్ దాఖలా వాగు పోరంబోకుగా గల ప్రభుత్వ భూమిని మోర్ల సామ్రాజ్యం ఆక్రమించి రాళ్లు, ముళ్ల తీగ వేసిందన్నారు. దీనిపై రంగాపురం శివారు బూరుగగూడెం గ్రామానికి చెందిన గుంటక సీతారెడ్డి పిటిషన్ వేయగా కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఆక్రమణదారులకు రెండుసార్లు రాళ్లు, ఇనుపకంచె తొలగించాల్సిందిగా నోటీసులు ఇచ్చారన్నారు. సదరు ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగించకపోవడంతో శనివారం పిటిషనర్ సమక్షంలో పొక్లెయిన్‌తో పూర్తిగా తొలగించామని ఆర్ఐ పుల్లయ్య తెలిపారు.

జనసేన ఎంపీటీసీ రాజీనామా

- కూటమి నేతల్లో అంతర్గత విభేదాలు
- టీడీపీ కొత్త నాయకులతో పొసగని వైనం



ఎంపీటీసీ సభ్యత్వం, జనసేన పార్టీ పదవికి రాజీనామా చేసిన పత్రాలు చూపుతున్న తేజ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలెం ఎంపీటీసీ సభ్యుడు పోలిశెట్టి తేజ తన ఎంపీటీసీ సభ్యత్వానికి, జనసేన పార్టీ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ కార్యాలయం వద్ద మీడియా ముఖంగా శనివారం ప్రకటించారు. అంతకు ముందు తన రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓ సునీతశర్మకు అందించేందుకు ప్రయత్నించారు. రాజీనామా పత్రం జెడ్పీ సీఈఓకు అందజేయాలని ఆమె సున్నితంగా తిరస్కరించారు. ఈ సందర్భంగా తేజ మీడియాతో మాట్లాడుతూ తన తండ్రి పోలిశెట్టి శ్రీహరి గతంలో గ్రామానికి ఎంపీటీసీ సభ్యునిగా చేశాడన్నారు. ఆయన స్ఫూర్తితో పవన్ కల్యాణ్‌పై అభిమానంతో అమెరికాలో ఉద్యోగం వదిలేసి వచ్చి గత ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందానని చెప్పారు. ఇటీవలి కాలంలో తన తండ్రి శ్రీహరి నేడు కలుషితమైన రాజకీయాలు మనకు సరిపడవని చెప్పారని, పదవికి రాజీనామా చేయాలని ఒత్తిడి చేశాడన్నారు. మూడు రోజుల కిందట తన తండ్రి మరణించడంతో ఆయన చివరి కోరిక మేరకు రాజీనామా చేస్తున్నట్లు లోపలి నుంచి వస్తున్న దుఖాన్ని ఆపుకుంటూ తన నిర్ణయం స్పష్టం చేశారు.

విభేదాలే కారణం..

అయితే గ్రామంలో కూటమి నాయకుల మధ్య తలెత్తిన విభేదాలతోనే తేజ రాజీనామా చేసినట్లు ప్రచారం సాగుతోంది. ఇటీవల జనసేన, కూటమి ప్రభుత్వ కార్యక్రమాలకు పెద్దగా హాజరు కాలేదు. గ్రామంలో జరిగిన వైద్య శిబిరాలు, ప్రభుత్వ భవనాలు, రోడ్ల ప్రారంభోత్సవంలో అతనికి ప్రాధాన్యత ఇవ్వక పోవడంతో అంటీ ముట్టనట్లుగా వ్యవహరించాడు. ఒకప్పటి తన రాజకీయ శత్రువులను నేడు టీడీపీలో చేర్చుకుని వారికే ప్రాధాన్యత ఇవ్వడాన్ని జీర్ణించుకోలేక రాజీనామా చేశాడని ప్రచారం సాగుతోంది. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తన అనుచరులకు గ్రామంలో ప్రాధాన్యత ఇవ్వడంతో కూటమిలో భాగమైన జనసేన ఎంపీటీసీ తేజకు ప్రాధాన్యత ఇవ్వక పోవడం వలన రాజీనామాకు సిద్ధపడ్డారని ప్రజలు బాహాటంగా చెప్పుకుంటున్నారు. ఇటీవలి కాలంలో జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను కొండపల్లిలో నిర్వహించిన సమావేశానికి మండల అధ్యక్షుడి హోదాలో తేజ హాజరు కాలేదు. ఉదయభాను ముందే కూటమి నాయకుల అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. తన వంతుగా రూ.35 లక్షలతో గ్రామంలో మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. గ్రామంలో ఎంపీటీసీగా తనను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలతో పాటు రాజీనామా చేస్తున్నందుకు క్షమాపణ కోరారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

నూజివీడు: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని, ఓటు హక్కును ఓటర్లు బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ అన్నారు. ట్రిపుల్ ఐటీలోని విద్యార్థులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశంలో 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికీ ఓటు హక్కును రాజ్యాంగం కల్పించిందన్నారు. దీని ద్వారా సమర్థవంతమైన పాలకులను ఎన్నుకోవాల్సిన బాధ్యత ఓటర్లపై ఉందన్నారు. ఓటు అనేది హక్కు కాదని, బాధ్యత అని చెప్పారు. అనంతరం ఓటు హక్కుపై విద్యార్థులు వ్యక్తంచేసిన పలు సందేహాలను సబ్ కలెక్టర్ నివృత్తి చేశారు. తహసీల్దార్ బీవీ సుబ్బారావు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి విద్యార్థి ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటింగ్ శాతం పెంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ బి. లక్ష్మణరావు, డెప్యూటీ తహసీల్దార్ రవికిరణ్ సింగ్, టీపీఓ కె. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలకు ముసుగు



లోపూడిలో సచివాలయం ఎదుట పార్టీల ఫ్లెక్సీలపై ముసుగులు వేయిస్తున్న సిబ్బంది



రామాలయం వద్ద ఫ్లెక్సీ తొలగించిన ప్రదేశం

సాక్షి ఎఫెక్ట్

ముసునూరు: 'ముసునూరు..కోడ్ పట్టించుకోరు', లోపూడిలో 'సచివాలయం ఎదురుగా ఫ్లెక్సీలు' శీర్షికలతో శనివారం సాక్షిలో వెలువడిన కథనాలపై పంచాయతీరాజ్ అధికారులు తక్షణమే స్పందించారు. మండలంలోని లోపూడి గ్రామ సచివాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, ముసునూరులోని పలుచోట్ల ఏర్పాటు చేసిన వివిధ రాజకీయ పార్టీ నాయకుల ఫ్లెక్సీలను అధికారులు తొలగించారు. ఈఓపీఆర్డీ బసవరాజు అచ్యుత సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు వాటిని తొలగింపజేశారు. మరి కొన్నింటిపై పరదాలతో ముసుగులు వేశారు.

భక్తులకు సౌకర్యాల కల్పనపై దృష్టి

మంత్రి కొలుసు పార్థసారథి



ఏర్పాట్లపై సూచనలిస్తున్న మంత్రి పార్థసారథి

ముసునూరు: ఉత్సవాల సమయంలో భక్తులకు సౌకర్యాలు కల్పించడంపై నిర్వాహకులు దృష్టి సారించాలని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బలివేలో మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను శనివారం సాయంత్రం అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య ఆధ్వర్యంలో అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామిని దర్శించుకుని, ఆలయ, ఉత్సవ ప్రాంగణాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బలివే శ్రీరామలింగేశ్వరస్వామి ఉత్సవ ప్రాంగణం, స్నాన ఘాట్‌లను పరిశీలించారు. ఈ ఏడాది ఉత్సవాల్లో భక్తులకు ఎక్కువ సౌకర్యాలు, పటిష్టమైన భద్రత కల్పించాలని ఎస్ఐ చిరంజీవిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖాధికారి రంగారావు, ప్రధానార్చకులు తోలేటి అరుణభాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.